క్లుప్తంగా

ఘనంగా కుంభాభిషేకం



చిత్తూరు రూరల్: నగరం కుమ్మర వీధిలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం ద్వితీయ కుంభాభిషేక పూజలను ఘనంగా నిర్వహించారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించి, హోమ, కలశ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు చాటింపు

చిత్తూరు రూరల్: నగరంలో ఈనెల 16,17 తేదీల్లో జరిగే నడివీధి గంగజాతరను పురస్కరించుకుని మంగళవారం చాంటిపు వేయనున్నారు. సాయంత్రం చెంగల్వాయ కొండ ప్రాంతంలో ఉన్న ఎల్ల దేవతకు పూజ చేసి చాటింపు ప్రారంభించనున్నారు. అనంతరం అమ్మవారిని ప్రతిష్టించే చోట ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.

ఎలక్షన్ డీటీగా అరుణకుమారి



చిత్తూరు రూరల్: చిత్తూరు ఎలక్షన్ డీటీ (ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్)గా అరుణకుమారి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలను చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ బదిలీపై వెళ్లారు. ఈ స్థానంలో అరుణకుమారి నియమితులయ్యారు.

వేసవి శిబిరం ప్రారంభం

పూతలపట్టు: మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం స్థానిక సర్పంచ్ మాసిలామణి ప్రారంభించారు. సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉచితంగా తెలుగు వ్యాకరణం, స్పోకెన్ ఇంగ్లీష్, సంగీతం , పాటలు, చిత్రలేఖనం వంటివి నేర్పిస్తారని తెలియజేశారు. ఈ శిబిరం జూన్ 11వ తేదీ వరకు ఉదయం 7 నుంచి 11 వరకు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు వన్‌టౌన్ సీఐ బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ సీఐ నరసింహరాజును బదిలీ అయ్యారు. పరిపాలన దృష్ట్యా నరసింహరాజును కర్నూలు రేంజ్‌కు బదిలీ చేస్తున్నట్లు చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు సీసీఎస్ సీఐ భాస్కర్‌ను వన్‌టౌన్‌కు ఇన్‌చార్జ్‌గా నియమించారు.

వార్డు కార్యదర్శి సస్పెన్షన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 36వ డివిజన్ సచివాలయ కార్యదర్శి ఎస్.సదాశివన్‌ను సస్పెండ్ చేస్తూ కమిషనర్ అరుణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లక్ష్యాలను చేరుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు కార్యదర్శిని సస్పెండ్ చేస్తున్నట్లు కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాలువలోపడి వృద్ధుడి మృతి



కాలువలో తేలుతున్న వృద్ధుడి మృతదేహం

పూతలపట్టు: మండలంలోని పేటఅగ్రహారంలో ఓ అనాథ వృద్ధుడు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఎస్ఐ హరిప్రసాద్ కథనం మేరకు, కొన్నేళ్ల క్రితం ఆ అనాథ వృద్ధుడు పేట అగ్రహారంలో స్థానికుల సహాయంతో కడుపు నింపుకుంటూ అరుగుల మీద కునుకుతీసేవాడు. ఈ క్రమంలోనే కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. కాలువలో ఆ వృద్ధుడి మృతదేహం సోమవారం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి, ఆ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

అలరించిన అర్జున తపస్సు

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని కొత్తపల్లిలో జరుగుతున్న మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. అర్జున వేషధారి మానుపై నుంచి విసిరిన విబూధి, నిమ్మ పండ్ల కోసం భక్తులు ఎగబడ్డారు. మహిళలు సంతానం కోసం తడిదుస్తులతో తపస్సు మాను చుట్టూ వరపడ్డారు.



తపస్సుమాను ఎక్కుతున్న అర్జున వేషధారి

మార్ట్‌తో మహిళా సాధికారత

చేయూత మార్ట్‌తో మహిళాసాధికారతకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. నిత్యావసరమైన సరుకులను నాణ్యంగా, చౌకగా అందిస్తోంది. తద్వారా ఆదాయాన్ని ఆర్జించే మార్గం చూపుతోంది. మహిళా సభ్యులకు ఈ మార్ట్ ప్రధాన ఆదాయ వనరుగా మారుతోంది. ఏడాదికోసారి లాభాల్లో వాటాలు మహిళలకు అందించేలా ప్రణాళిక రూపొందించింది. నెలకు సుమారు రూ.35లక్షలకు పైగా లావాదేవీలు నిర్వహిస్తున్న తవణంపల్లె మహిళా మార్ట్ గురించి తెలుసుకుందాం.

- మార్ట్‌లో నాణ్యమైన వస్తువులు లభ్యం
- 12,274 మంది సభ్యుల వాటాధనం
- నెలకు నగటున రూ.35లక్షలకు పైగా టర్నోవర్



తవణంపల్లెలో చేయూత మహిళా మార్ట్ నిర్వహిస్తున్న మహిళలు



సరుకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

తవణంపల్లె: రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, వైఎస్సార్ క్రాంతి పథకం ఆధ్వర్యంలో చేయూత మహిళా మార్ట్‌ను నిర్వహిస్తున్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకు నాణ్యమైన వస్తువులను(సరుకులు) అందించాలనే లక్ష్యంతో ఫిబ్రవరిలో చేయూత మహిళా మార్ట్‌ను మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ మార్ట్‌లో మండలంలోని 12,274 మంది సభ్యులు రూ.10 చొప్పున చెల్లించి సభ్యత్వం పొందారు. అదే విధంగా స్వయం సహాయక సంఘ సభ్యులు వాటా ధనం ఒక్కొక్కరు రూ.200 చొప్పున పెట్టుబడిగా పెట్టారు. సభ్యత్వ రుసుం రూ.1,22,740 కాగా సభ్యుల వాటా పెట్టుబడి కింద రూ.24,54,800 సమకూర్చుకున్నారు. సభ్యత్వం పొందిన మహిళలు కమిటీలుగా ఏర్పాటయ్యారు. వస్తువుల కొనుగోలు కమిటీలు, అమ్మకాల కమిటీ, పర్యవేక్షణ కమిటీలుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీల ద్వారా సంబంధిత ఏజెన్సీలు, హోల్‌సేల్ డీలర్లతో ఒప్పందం చేసుకున్నారు. సరుకుల నాణ్యతకు పరిశీలించి కొనుగోలు చేసి ఎంఆర్‌పీ కన్నా తక్కువ రేట్లకు మార్ట్‌లో విక్రయిస్తున్నారు. చేయూత మార్ట్ ద్వారా 57 రోజుల్లో రూ.73,59,599 వ్యాపార లావాదేవీలు నిర్వహించారు. అంటే రోజుకు సరాసరి రూ.1,29,116 లావాదేవీలు చేసి రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది.

– చేయూత మహిళా మార్ట్ ద్వారా మండలంలో 12,274 మంది సభ్యులు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఈ వ్యాపారం వల్ల లాభాల్లో 40 శాతం ఏడాదికోసారి వాటాదారులకు పంపిణీ చేస్తారు. మిగిలిన 60 శాతం నిధులను వ్యాపార అభివృద్ధికి వినియోగిస్తారు. ప్రతి సభ్యురాలు ఇంటికి అవసరమైన వస్తువులను నెలకోసారి మార్ట్‌లోనే కొనుగోలు చేస్తూ వ్యాపార అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారు చేసే వస్తువులు, ఉత్పత్తి చేసిన వస్తువులను సైతం మార్ట్‌లో విక్రయిస్తున్నారు. సంఘ సభ్యులు తయారు చేసిన, ఉత్పత్తి చేసిన వస్తువులు కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

మహిళలే యజమానులు



చేయూత మహిళా మార్ట్‌కు సంఘ సభ్యులే యజమానులు. మండలంలోని సభ్యుల వాటా ధనంతోనే వ్యాపారాలు సాగుతున్నాయి. ఎమ్మార్పీ కంటే తక్కువ ధరలకే వస్తువులను విక్రయిస్తున్నారు. సంఘం సభ్యులందరూ ఈ మార్ట్‌లోనే కొనుగోలు చేసి లాభాలను గడిస్తున్నారు.

– రవి, ఏపీఎం, డీఆర్‌డీఏ, తవణంపల్లె

సమాఖ్యతో నడిపిస్తున్నాం



మండల సమాఖ్య ద్వారా చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేశాం. మార్ట్‌లో రోజుకు రూ.1.29లక్షల మేరకు వ్యాపార లావాదేవీలు సాగుతున్నాయి. ప్రతి సభ్యురాలు మార్ట్‌లోనే తక్కువ ధరలకు సరుకులను కొనుగోలు చేస్తోంది. సంఘ సభ్యులు తయారు చేసిన వస్తువులు, ఉత్పత్తి చేసిన వస్తువులను ఇక్కడే విక్రయిస్తున్నాం.

– జయలలిత, అధ్యక్షురాలు, మండల సమాఖ్య

తక్కువ ధరకే కొంటున్నాను



నెలకోసారి మార్ట్‌లో ఇంటికి అవసరమైన వస్తువులు ఎమ్మార్పీ కంటే తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నాను. సంఘ సభ్యులు తయారు చేసిన వస్తువులు, ఉత్పత్తి చేసిన వస్తువులు కూడా అమ్ముకుంటున్నాం. కొనుక్కొంటున్నాం. ఈ సరుకులు బయట కొనడం కంటే, ఈ మార్ట్‌లో కొనడం వల్ల డబ్బు ఆదా అవుతోంది.

– ప్రభావతి, సంఘ సభ్యురాలు, టి.పుత్తూరు

గ్రూపు లీడర్లకు బాధ్యత అవసరం

తవణంపల్లె: స్వయం సహాయక గ్రూపు(ఎస్‌హెచ్‌జీ) లీడర్లు బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందని మండలంలోని దిగువమాఘం ఇండియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రకాష్ అన్నారు. సోమవారం తవణంపల్లె వైఎస్సార్ ఇందిర క్రాంతి కార్యాలయంలో ముట్టుకూరులోని గాంధీ ఎస్‌హెచ్‌జీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆ గ్రూపు రెండో లీడర్ సంధ్య రుణం చెల్లించేందుకు వసూలు చేసిన డబ్బులు తీసుకుని ఉడాయించినట్లు సభ్యులు ఫిర్యాదు చేశారు. దీని వల్లే బ్యాంకులో రుణం పేరుకు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఫీల్డు ఆఫీసర్ ప్రకాష్ మాట్లాడుతూ డబ్బుల లావాదేవీలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక



రోగులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 30 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 52 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. అందులో 30 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. వారిని చెన్నైకి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేసి, మందులు, కంటి అద్దాలు అందించనున్నట్లు తెలిపారు.

సకాలంలో 'స్పందన' వినతులు పరిష్కారం



అర్జీల స్వీకరణలో కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. స్పందన వినతులపై సంబంధిత శాఖాధిపతులు క్షేత్రస్థాయిలో విచారించి సకాలంలో పరిష్కరించాలని చెప్పారు. గతవారం అందిన వినతులపై సమీక్ష నిర్వహించారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో ఇంజినీరింగ్ 5, టౌన్ ప్లానింగ్ 3, రెవెన్యూ సెక్షన్ – 1, ఇతరాలు –2 మొత్తం 11 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డా.లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సుందరంగా డంపింగ్ యార్డ్ నిర్వహణ



డంపింగ్ యార్డు పరిశీలనలో మేయర్ అముద

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ డంపింగ్ యార్డ్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని, ప్రస్తుతం చేస్తున్న వ్యవసాయాన్ని మరింతగా విస్తరించాలని నగర మేయర్ అముద అధికారులను ఆదేశించారు. మేయర్ సోమవారం సంతపేటలోని నగరపాలక సంస్థ డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. యార్డులోని ఖాళీ స్థలంలో చేపడుతున్న సేంద్రియ వ్యవసాయ పంటలను పరిశీలించారు. కూరగాయల సాగును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సేంద్రియ వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని అధికారులకు సూచించారు. డంపింగ్ యార్డ్ లో వర్మీ కంపోస్టు యూనిట్ పరిశీలించారు. వ్యర్థాలతో రూపొందించిన వివిధ కళారూపాలను తిలకించారు. అనంతరం డంపింగ్ యార్డ్ నిర్వహణపై ప్రజారోగ్య అధికారి లోకేష్‌తో చర్చించారు. వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిత్తూరు ప్రెస్‌క్లబ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ (గుర్తింపు) కార్డుల మంజూరులో నిబంధనలు సడలించాలని చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో నిరసన తెలిపి, కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. మేరకు ఏపీడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు లోకనాథ్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అశోక్ కుమార్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. అక్రిడిటేషన్ల మంజూరులో ఉన్న నిబంధనలను సడలించాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాకు జిల్లా కేంద్రంలోనే నాలుగు, ఇవ్వాలని, జిల్లాలో ముద్రితమవుతున్న చిన్నపత్రికలకు నియోజకవర్గానికి నాలుగు, సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా డెస్కు జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీచేసిన నిబంధనలను అనుసరించి, అక్రిడిటేషన్ ఇస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల ప్రధానమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు షకీల్, శివ, చంద్ర, సీనియర్ జర్నలిస్టులు రమేష్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చిత్తూరు కార్పొరేషన్: వేసవి శిబిరాలను పిల్లలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉచిత వేసవి శిబిరం కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖ గ్రంథాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో ఈనెల 8 నుంచి జూన్ 6 వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవలని గ్రంథాలయ చైర్మన్ మధుబాల తెలిపారు. 6–10 తరగతుల విద్యార్థులకు యోగా, మెడిటేషన్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, చెస్, క్యారమ్స్, సంగీతం, డాన్స్ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణలో ప్రతిభ చూపినవారికి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత గ్రంథాలయాల్లో వారి పేర్లను నేరుగా వెళ్లి నమోదు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లావణ్య, డీవైఈఓ చంద్రశేఖర్, డిప్యూటీ గ్రంథాలయాధికారి గజేంద్రబాబు, లలిత, కార్పొరేటర్ ఉన్ని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను గుర్తించాలి

ఐరాల: పిల్లల్లో సృజనాత్మకతను గుర్తించి ఆయా రంగాల్లో ప్రోత్సహించాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయాధికారి సుజాత ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిక్షణలో విద్యార్థులకు నేర్పుతున్న అంశాలను ఆయన పరిశీలించారు. కాసేపు పిల్లలతో ముచ్చటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత, నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు. శిక్షణలో నేర్చుకుంటున్న చిత్రలేఖనం, సంగీతం, సాహిత్యం, నృత్యం వంటింవి పిల్లల్లో సృజనశక్తిని పెంపొందిస్తాయని చెప్పారు. ముఖ్యంగా నేటితరం పిల్లలకు పుస్తక పఠనాన్ని అలవాటు చేసేందుకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం లైబ్రేరియన్ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, పుస్తక పఠనం, కథలు చదవడం, నృత్యం, గేయాలు, స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

బోధకాలు నివారణకు చర్యలు



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

తవణంపల్లె: బోధకాలు వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని మండల వైద్యాధికారులు ప్రియాంక, వినయ్‌కుమార్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం బోధకాలు వ్యాధిగ్రస్తులకు మెడికల్ కిట్ పంపిణీ చేశారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ దోమకాటు వల్ల బోధకాలు వ్యాధి వ్యాపిస్తుందని వివరించారు. ఈ వ్యాధి సోకిన వెంటనే పరీక్షలు చేసుకొని వైద్యం చేసుకుంటే నివారించవచ్చని పేర్కొన్నారు. డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ రోగులు సకాలంలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరమణ, పీహెచ్ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, అమరావతి, జయమ్మ, శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటివద్దకే వైద్యం



గుడిపాల: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ప్రశాంతి



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గ్రామీణులకు ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్నట్లు 104 వైద్యాధికారి ప్రశాంతి అన్నారు. మండలంలోని గురువారం కొత్తకోటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు రక్తపరీక్షలు చేశారు. బీపీ, చక్కెరవ్యాధి గ్రస్తులకు 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది హైమావతి, సుమతి, గీత, తమరై పాల్గొన్నారు.

పాలకల–1లో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని పాలకల–1లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 104 వైద్య శిబిరంలో 100 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. సీహెచ్ఓ సుగుణవతి, హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



నాంపల్లె దళితవాడలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని ఇరువారంపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆయన సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయాన్నే గ్రామాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు ఆయా గ్రామస్తులు హారతులు, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఆయా ఇళ్లకు చేకూరిన లబ్ధిని సంక్షేమ బుక్‌లెట్‌ల ద్వారా వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే 270 ఇళ్లను సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి దాదాపు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర లబ్ధి చేకూరిందని చెప్పారు. ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు ఇళ్ల వద్దకే చేరుతున్నాయన్నారు. మహిళాభివృద్ధికి జగనన్న పెద్ద పీట వేస్తున్నారని, పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ మోహన్, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి, తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.

నేడు ఇరువారంపల్లెలో గడప గడపకూ..

మండలంలోని ఇరువారంపల్లె సచివాలయ పరిధిలో మంగళవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. దీనికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరవుతారని చెప్పారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని ఆదేశించారు.

కుశస్థలి ఉధృతం



కుశస్థలి నదిలో చిక్కుకున్న ట్రాక్టర్

నగరి : ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణాపురంలోని అమ్మపల్లి డ్యాం నిండి గేట్లు తెరవడంతో సోమవారం ఉదయం నుంచే కుశస్థలి నదిలో ప్రవాహం ఉధృతమైంది. దీంతో ఇసుక, రాళ్లు, గడ్డితో కనిపించే నది నీటి ప్రవాహంతో కళకళలాడింది. తెరణి సమీపంలో ఇసుక కోసం వెళ్లిన ట్రాక్టర్ నీటిలో చిక్కుకుంది. నీటి ప్రవాహం తగ్గేంత వరకు వాహనాన్ని బయటకు తీసే వీలు లేని పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని నీటిలోనే వదిలి గట్టుకు చేరుకున్నారు.

సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి



కేకు కట్‌చేస్తున్న గౌహతి సుబ్బారెడ్డి, కుమారులు

పూతలపట్టు: దివంగత నేత సుబ్బారెడ్డి సేవలు మరవలేనివని ఆయన సతీమణి గౌహతి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పూతలపట్టు మాజీ వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి 56వ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించి, భారీ కేకును కట్ చేశారు. సుబ్బారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు సమర్పించారు. గౌహతి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సుబ్బారెడ్డి లేని లోటు తాను ముందుండి తీరుస్తానని మండల ప్రజలకు భరోసానిచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. అనంతరం పారిశ్రామిక వేత్త జగదీశ్వర్ రెడ్డి తన నివాసంలో సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు సమర్పించారు.